క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నర్సంపేట : హన్మకొండలో జరిగిన కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు నర్సంపేట షిటోకాన్ జపాన్ కరాటే డు ఇండియా హంబు సంస్థ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రచ్చ శ్రీనుబాబు తెలిపారు. ఈ మేరకు పథకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం ఆయన అభినందించి మాట్లాడారు. జపాన్ కరాటే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కటా అండర్–7 బాలుర విభాగంలో సిద్ధార్థ, అండర్–8 విభాగంలో సుధాన్స్, అండర్–9 విభాగంలో మనీశ్, అండర్–11 విభాగంలో శివప్రసాద్ బంగారు పథకాలు సాధించినట్లు తెలిపారు. అలాగే అండర్–11 బాలికల విభాగంలో అంజన, అండర్–12 బాలుర విభాగంలో మణిదీప్, అండర్–13 విభాగంలో గురుచరణ్ బంగారు పథకాలు సాధించారని వివరించారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ భవానీచందర్ పాల్గొన్నారు.

'సహ' జిల్లా యూత్ కన్వీనర్‌గా ప్రణీత్ గౌడ్



చెన్నారావుపేట : సమాచార హక్కు రక్షణ చట్టం –2005 జిల్లా యూత్ కన్వీనర్‌గా మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన న్యాయ విద్యార్థి కళ్లెపు ప్రణీత్ గౌడ్‌ను నియమించినట్లు రాష్ట్ర నియామక ఇన్‌చార్జ్ చందమల్ల సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో ప్రణీత్ మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తానని చెప్పారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ బాధ్యతగా నడుచుకుంటానని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గజ్జె శ్యాంప్రసాద్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలువేరు కరుణాకర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెట్టబోయిన విద్యాసాగర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

నెక్కొండ : మండల కేంద్రంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని హనుమాన్ బజార్‌కు చెందిన సూదనపు సారయ్య, గంధం రాజు, లైెట్టి వినయ్, బెజ్జంకి వెంకటేశ్వర్లు, బెజ్జంకి శ్రీనివాస్, అశోక్ కోరారు. హనుమాన్ బజార్‌కు చెందిన వారు, యాదవ సంఘం నాయకుల మధ్య భూమి విషయంలో ఆదివారం వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా హనుమాన్ బజార్ వాసులు విలేకరులతో మాట్లాడారు. హనుమాన్ బజార్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న 180 గజాల ప్రభుత్వ భూమికి గతంలో మాజీ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి ఆధ్వర్యంలో హద్దులు పెట్టి ఫెన్సింగ్, బోర్డు ఏర్పాటు చేశారని చెప్పారు. కాగా సదరు భూమి తమదేనంటూ ఏడాది క్రితం యాదవ సంఘం నాయకులు బోర్డు, ఫెన్సింగ్ తొలగించారని తెలిపారు.

నిందితుడిపై కేసు నమోదు

నల్లబెల్లి : పాడిరైతుపై దాడి చేసిన ఘటనలో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కొండాపూర్‌కు చెందిన పాడిరైతు కందికొండ కుమారస్వామి తన రెండు ఎద్దులను ఈనెల 27న గ్రామ శివారులోని బీడు భూమిలో మేత కోసం కట్టేశారు. వాటిని తోలుకెళ్లేందుకు రాగా ఎద్దు కుడికాలిపై రక్తగాయం కనిపించింది. గాయం విషయమై సమీపంలో గొర్రెలను మేపుతున్న గ్రామానికి చెందిన జక్కుల రాములుతో కుమారస్వామి చర్చిస్తుండగా రాములు చేతిలోని గొడ్డలికి రక్తం మరకలు కనిపించాయి. దీంతో ఎద్దుపై గొడ్డలితో ఎందుకు దాడి చేశావని కుమారస్వామి ప్రశ్నించగా రాములు రాయితో గాయపర్చాడు. గాయపడిన కుమారస్వామిని కుటుంబీకులు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిని నియమించాలి

చెన్నారావుపేట : చెన్నారావుపేట మేజర్ గ్రామ పంచాయతీకి కార్యదర్శిని నియమించాలని మాజీ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కార్యదర్శి లేకపోవడంతో గ్రామంలో పారిశుద్ధ్యం పేరుకుపోయిందని చెప్పారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత కార్యదర్శిని నియమించాలని కోరారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని ఊకల్‌కు చెందిన కేవ్లానాయక్ ఇటీవల మృతి చెందగా అతడి కొడుకులు అయిన మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌ను, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్‌నాయక్‌ను బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ఆదివారం పరామర్శించారు. తొలుత కేవ్లానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, తాటికొండ రాజయ్య, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెసర రైతుకు కష్టాలు

- అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- పెట్టుబడి కూడా రాని దైన్యం
- జిల్లాలో 18 వేల ఎకరాల్లో సాగు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి



జీడికల్‌లో దెబ్బతిన్న పెసర పంట



మొలకలు వస్తున్న గింజలు

దుగ్గొండి : పెసర రైతును కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రారంభంలో రాయితీ విత్తనాలు లభించలేదు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేశారు. ఈనెల ప్రారంభంలో, ఇటీవల కురిసిన వర్షాలు పెసర రైతును నిండా ముంచాయి. ప్రకృతి ప్రకోపంతో ప్రతియేట ఏదోరూపంలో ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు వేసేటప్పుడు వర్షాలు లేకపోవడం, తీరా పంట చేతికి వచ్చే సమయాన ఏకధాటిగా వర్షాలు కురిశాయి. ఈసారి జిల్లా వ్యాప్తంగా 18 వేల ఎకరాల్లో రైతులు పెసర పంట సాగు చేశారు. పంట ప్రస్తుతం కోత దశకు వచ్చింది. వర్షాలకు కాయల్లోని గింజలు మొలకలు వస్తున్నాయి. రైతుకు కనీసం కిలో దిగుబడి అయినా రాని పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు రూ.15 వేల వరకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 5 క్వింటాళ్ల దిగుబడితో రూ.50 వేలు వస్తాయని అనుకున్న తమకు చిల్లిగవ్వ రాలేదని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి పంట నష్టపరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

మూడు ఎకరాల్లో సాగు చేశా..



నేను మూడు ఎకరాల్లో పెసర పంట సాగు చేస్తే కాపు బాగా వచ్చింది. హార్వెస్టర్‌తో కోయాలని అనుకున్న మరుసటి రోజు నుంచే వానలు ప్రారంభమయ్యాయి. రూ.1.50 లక్షలు వస్తాయి అనుకున్నా. వర్షాలకు చేనులోనే గింజలు మొలకలు వస్తున్నాయి. భూమిలో కలియదున్నడమే తరువాయి. ప్రభుత్వం స్పందించాలి. మా కష్టానికి పరిహారం ఇవ్వాలి.

-చెల్పూరి రాజమౌళి, జీడికల్, రైతు

రూ.25 వేల పరిహారం ఇవ్వాలి



నేను 2 ఎకరాల్లో పెసర వేశా. రెండో పంటగా మొక్కజొన్న వేస్తే భూమిలో బలం పెరిగి మొదటి పంట పెసర చాలా బాగా వచ్చింది. రెండు ఎకరాలకు రూ.30 వేల పెట్టుబడి పెట్టిన. పెసర్లు అమ్మితే 80 వేలు వచ్చినా రూ. 50 వేలు మిగులుతయి అనుకున్న. పంట చేతికి వచ్చే సమయంలో వర్షం నిండా ముంచింది. ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి.

-అనగోని తిరుపతి, చలపర్తి

వృద్ధులకు సమాజం అండగా నిలవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వృద్ధులు

చెన్నారావుపేట : వృద్ధులకు సమాజం అండగా నిలవాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ ఆకాంక్షించారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జాగృతి స్కూల్ నుంచి ఎస్‌బీఐ వరకు సంఘం ఆధ్వర్యంలో వృద్ధులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల సంక్షేమానికి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వృద్ధాప్యంలో పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. మండల కేంద్రాల్లో వృద్ధుల కోసం డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య, సభ్యులు వరంగంటి మల్లయ్య, పత్తి అనంతరెడ్డి, వరంగంటి కుమారస్వామి, ముత్యం సాంబయ్య, గట్ల కృష్ణ, కంది నారాయణరెడ్డి, తోట ఆనందం, కొరె కట్టయ్య, దొనికెల వీరయ్య, మర్రి సాంబయ్య, సంజీవరెడ్డి, సిద్దె కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు తగదు

- కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు నిరాధార ఆరోపణలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నాగరాజు ఎంఆర్‌పీఎస్‌పైనా, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎక్కడ కూడా తగని వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఉద్యమ నాయకులు ఎమ్మెల్యే నాగరాజు మాటలను వక్రీకరిస్తున్నారని తెలిపారు. మాలల ఓట్లు మెజారిటీ స్థాయిలో కాంగ్రెస్‌కు పోలవగా మాదిగల ఓట్లు కొన్ని బీఆర్ఎస్, బీజేపీలకు బదిలీ అయ్యాయని వ్యాఖ్యానించాడని వివరించారు. కట్ర్యాలలో మాదిగలు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నాగరాజును కోరితే వివేక్ ద్వారా విగ్రహాలను అందించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే నాగరాజుపై మంద కృష్ణ అనేక ఆరోపణలు చేసినా ఏనాడూ ఎంఆర్‌పీఎస్‌ను, మంద కృష్ణను విమర్శించలేదని తెలిపారు. జేఏసీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు బీఆర్ఎస్, బీజేపీల ఉచ్చులో పడి నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని మానుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు తుమ్మల రవీందర్, సూరారపు నిరంజన్, మల్లెపాక సమ్మయ్య, తూళ్ల రవి, కొండేటి బాలకృష్ణ, హన్మకొండ సుధాకర్, చీటూరి రాజు, నందిపాక భాస్కర్ పాల్గొన్నారు.

రైతులకు ఆంక్షల్లేకుండా రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాబు

దుగ్గొండి : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఆంక్షలు లేకుండా రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మంపేటలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేల 500, రైతులకు రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. పేదలకు ఇండ్లు కట్టించాలని, స్థలాలు కేటాయించాలని, సబ్సిడీతో సంబంధం లేకుండా రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు తప్పవని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోరబోయిన కుమారస్వామి, భూక్యా సమ్మయ్య నాయక్, మండల కార్యదర్శి బోళ్ల సాంబయ్య, అక్కపెల్లి సుధాకర్, నల్లగొండ మొగిలి, గిన్నె సాంబయ్య, జటబోయిన జన్నయ్య, శివరాత్రి సాంబయ్య, నల్లగొండ కోటి, సొదారపు మొగిలి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బడుగులకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం రాజకీయంగా ప్రాధాన్యత ఇస్తోందని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సామాజికవర్గానికి చెందిన మల్లికార్జున ఖర్గెకు జాతీయ అధ్యక్ష పదవి, రాష్ట్రంలో బొమ్మ మహేశ్ గౌడ్‌కు పీసీసీ చీఫ్ పదవి ఇచ్చి మార్క్‌ను చాటుకుందన్నారు. అనేక మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన నాయకులకు ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఇతర అనేక నామినేటెడ్ పోస్టులు సైతం కల్పిస్తూ ప్రోత్సహిస్తోందని తెలిపారు. విశ్రాంత పోలీస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు హోం శాఖ మంత్రి పదవి ఇస్తే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మకు తగిన గుర్తింపు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా చాకలి ఐలమ్మ పేరును మహిళా యూనివర్సిటీకి నామకరణం చేసిన క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు కంజర్ల సమ్మయ్య, చల్లా మిధున్, గబ్బెట బాబు, కొండేటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



వ్యవసాయ బావితో ప్రాణాపాయం

మండలంలోని అమృతండాకు వెళ్లే సీసీ రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావితో ప్రాణాపాయం పొంచి ఉంది. వాహనదార్లు ఎదురుగా ఏదైనా వాహనం వచ్చినా, రాత్రివేళ అదుపు తప్పినా బావిలో పడడం ఖాయం. బావి మట్టికూలు తుండడంతో సీసీ రోడ్డు కిందకు వచ్చింది. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తండావాసులు వాపోయారు. ఇకనైనా బావికి ఓడలు పోసేలా లేదా రక్షణ చర్యలు చేపట్టేలా కృషి చేయాలని కోరుతున్నారు. - చెన్నారావుపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
ఎర్రబెల్లి శ్యామ్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 9581658102

కళాకారులకు అభినందన



చెన్నారావుపేట : మండలానికి చెందిన డప్పు కళాకారులను మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అభినందించారు. గోరుగుట్ట తండాలో ఓ వ్యక్తి మృతి చెందగా అతడి అంత్యక్రియలకు డప్పు కొట్టేందుకు కళాకారులు వెళ్లగా వారి విన్యాసాలను ఎమ్మెల్యే చూసి చలించారు. డప్పు కళాకారుల ఆటపాట అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు మేకల రాజు, హరీశ్, రాజు, శ్రీధర్, కుమార్, మహేందర్, కృష్ణ, మేకల దయాకర్, కోడిపుంజుల ఐలయ్య, రాకేశ్, గణేశ్, కవి, గాయకుడు బరిగెల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ

సంగెం : మండలంలోని గ్రామపంచాయతీల్లోని మంచినీటి సహాయకులకు నేటి (సోమవారం) నుంచి ఐదు రోజులపాటు శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు శిక్షణ ప్రారంభమై అక్టోబర్ 4వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. మంచినీటి సహాయకులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

నేటి చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

రాయపర్తి : మండల కేంద్రంలోని మంచినీళ్ల చెరువు పరిరక్షణ కోసం నేడు (సోమవారం) తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మంచినీళ్ల చెరువు పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. మండల కేంద్రంలోని అంగడి ప్రాంతంలో సభ్యులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సత్యనారాయణ హ్యాచరీ కోళ్లఫాం వల్ల మంచినీళ్ల చెరువు కలుషితం అవుతుండటంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదంటూ నిరసన తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నర్సంపేట : పట్టణంలోని 13వ వార్డుకు చెందిన నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు రుద్ర ఓం ప్రకాశ్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.2,500 నగదు సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆబోతు రాజు, కన్నీ కుమార్, రంజిత్, రాజా, నవీన్, చారి, రాజేందర్, రాజు, రజాక్ పాల్గొన్నారు.

ఐక్యతతో ఆర్థిక స్వావలంబన

- ప్రశాంతి సమాఖ్య అధ్యక్షురాలు లలిత



సమావేశంలో మాట్లాడుతున్న లలిత

దుగ్గొండి : ఐక్యతతో ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రశాంతి మండల సమాఖ్య అధ్యక్షురాలు అన్నారపు లలిత తెలిపారు. మండల కేంద్రంలో సమాఖ్య 15వ వార్షిక మహాసభ ఆదివారం నిర్వహించారు. మొదట ఏడాది కాలంలో ఆర్థిక లావాదేవీలను చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడారు. వంటింటికి పరిమితమైన మహిళలు సంఘటిత శక్తితో పరపతి సాధించి కుటుంబాన్ని నడిపే స్థాయికి ఎదిగినట్టు తెలిపారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలు పొదుపులను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. స్త్రీనిధి, ఎస్‌హెచ్‌జీ రుణాలు తీసుకుని పరిశ్రమలు స్థాపించాలని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళా సంఘాలకు రూ.15–20 లక్షలు రుణం ఇస్తున్నట్టు తెలిపారు. సభ్యులు సక్రమంగా వాయిదాలు చెల్లించి జీరో వడ్డీకి అర్హత సాధించాలన్నారు. గ్రామాల్లో కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేసి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. సమావేశంలో ఏపీఎం రాజ్‌కుమార్, సమాఖ్య కార్యదర్శి బోడకుంట్ల రజిత, కోశాధికారి బొల్లం సావిత్రి, ఉపాధ్యక్షురాలు హింగె మీనాబాయి, సీసీలు బాబు, పద్మ, సంధ్య, అకౌంటెంట్ అరుణ, రంజిత తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఉన్నతే ప్రభుత్వ ధ్యేయం

- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పార్వతమ్మ



దుగ్గొండి : సభ్యత్వం ఇస్తున్న పార్వతమ్మ

దుగ్గొండి : మహిళల ఉన్నతే రాష్ట్ర ప్రభుత్వ, కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ తెలిపారు. మండలంలోని మందపల్లి, మదిర గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా తోడ్పాటు అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి, తదితర పథకాలు పేదలకు సాంత్వన కలిగిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వెండి సక్కుబాయి, బుర్రి సునీత, కోతి మమత తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బండి పద్మ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ ధోని కమలమ్మ, నాయకులు వీరూ, లావుడ్య వెంకన్న, చెక్క రమ, మల్లికాంబ, రేణుక, సునీత, రాధిక పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ హరిబాబు

- ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి

ఖానాపురం : సొసైటీలో రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేయాలని ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి కోరారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో ఆదివారం నిర్వహించిన మహాజన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశం కొంత రసాభాసగా సాగింది. బీఆర్ఎస్ పార్టీ రుణమాఫీ చేయకపోతేనే కాంగ్రెస్‌కు ఓట్లు పడ్డాయని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ఆర్ సొసైటీని తీసుకురాగా మాజీ సీఎం కేసీఆర్ కొనసాగించాడని చెప్పారు. తొలుత రైతు రాములు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. 40కి బదులు 42 కిలోలు కాంటా వేస్తున్నారని వాపోయాడు. రెండు కిలోల డబ్బులు ఎవరికి పోతున్నాయో సొసైటీ బాధ్యులు తెలపాలని కోరారు. 'ఏ' గ్రేడ్ ధాన్యాన్ని కూడా కామన్ రకం కింద కాంటా వేస్తున్నా సొసైటీ పట్టించుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. మరో బాబురావు మాట్లాడుతూ బార్దాన్ ట్రాన్స్‌పోర్ట్ డబ్బులు కాంట్రాక్టర్ కట్టాల్సి ఉండగా సొసైటీ నుంచి చార్జీల డబ్బులు ఎలా కడతారని నిలదీశారు. కాంట్రాక్టర్ నుంచి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. మరో రైతు వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ సబ్‌మార్కెట్ యార్డులోని వేబ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రుణమాఫీ కొందరికి మాత్రమే వర్తించిన క్రమంలో అందరికీ అమలయ్యేలా తీర్మానం చేయాలని కోరగా అవసరం లేదని ఏఎంసీ వైస్ చైర్మన్ హరిబాబు అనడంతో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఏఎంసీ వైస్‌చైర్మన్ శాఖమూరి హరిబాబు మాట్లాడుతూ మార్కెట్‌లో రూ.8 కోట్ల నిధులున్న క్రమంలో రూ.4 కోట్ల వ్యయంతో ఆధునీకరణ పనులు చేపడతామని చెప్పారు. గత ప్రభుత్వం హక్కుపత్రాలు ఇచ్చినా ధరణిలో నమోదు చేయకపోవడంతో రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. దసరా కానుకగా ప్రభుత్వం రైతు భరోసా అందించనుందని చెప్పారు. అనంతరం పలు తీర్మాణాలు చేశారు. మాజీ ఎంపీటీసీలను, సర్పంచ్‌లను ఘనంగా సత్కరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ వేణు కృష్ణ, డైరెక్టర్లు సాంబయ్య, కుమారస్వామి, సునీత, అన్నమనేని రవీందర్ రావు, అచ్యుతం, రాజు, సీఈఓ ఆంజనేయులు, స్టాఫ్ అసిస్టెంట్లు మేరుగు రాజు, కడ్దూరి వినయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ అధికారులపై దాడి సరికాదు



నిరసన తెలుపుతున్న తోటి తెగ నాయకులు

గీసుకొండ : ములుగు జిల్లా పరిధిలోని తాడ్వాయి మండలంలోని దామరవాయి గ్రామంలో ఆదివాసీ సామాజికవర్గానికి చెందిన అటవీ శాఖ బీట్ ఆఫీసర్లు వినోద్, శరత్‌చంద్రలపై జేసీబీ కాంట్రాక్టర్ సూరజ్‌రెడ్డి, మరో ఇద్దరు దాడి చేయడం సరికాదని ఆదివాసీ తోటి తెగ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం రఘు, నాయకులు సోమ సాంబయ్య, సోమ రాజేందర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌లోని జాన్‌పాకలోని తోటి తెగ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దాడులు పునరావృతం కాకుండా నిందితులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొలుత నిరసన తెలిపారు. సమావేశంలో తోటి తెగ నాయకులు తోటి నాగరాజు, సోమ రవీందర్, జగదీశ్వర్, రాజబాబు, శరత్‌బాబు, వెంకటస్వామి, ఆకుల యాదగిరి, ప్రశాంత్, గుర్రం ప్రశాంత్, రవీందర్, గేడెం కృష్ణ, కార్తీక్, షెడ్మాకి సదానందం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.